క్లుప్తంగా

తుఫాన్ సెలవులు బేఖాతర్

ఒంగోలు టౌన్: మిచాంగ్ తుఫాను కారణంగా గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో స్కూళ్లు, కళాశాలలకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సెలవులు ప్రకటించినప్పటికీ కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు బేఖాతరు చేసినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు తప్పనిసరిగా తరగతులకు హాజరు కావాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఆయా విద్యా సంస్థలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నైపుణ్య కేంద్రాల ఏర్పాటుపై ప్రశ్నించిన ఎంపీ

ఒంగోలు: అంతర్జాతీయ నైపుణ్య కేంద్రాల ఏర్పాటుపై పార్లమెంట్‌లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్న లేవనెత్తారు. రాష్ట్రంలో ఏర్పాటైన, నిర్మాణంలో ఉన్న అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, వాటి ఆర్థిక, భౌతిక, క్రియాత్మక పురోగతి గురించి ప్రశ్నించారు. కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత సహాయక శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమాధానం ఇస్తూ ఉద్యోగాలు పొందడంలో ప్రపంచ స్థాయి ప్రతిభ డిమాండ్‌ను అనుసరించి విదేశాల్లో ఉపాధి అవకాశాలు కోరే భారత విద్యార్థులు ప్రపంచ ప్రమాణాలు అందుకునేందుకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రారంభించిందన్నారు. వీటిలో వారికి అవసరమైన అన్ని వనరుల ఏర్పాటుతో శిక్షణ ఇవ్వడంతోపాటు సలహాలు, వీసా, పాస్‌పోర్టు పొందేందుకు సహాయం అందిస్తారన్నారు. ఈ కేంద్రాల స్థాపన కోసం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, ప్రవాసీ కౌశల్ వికాస్ యోజన పథకాలను అమలుచేస్తుందన్నారు. ప్రస్తుతం 4230 మంది అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారని, ఈశిక్షణతో వారు ప్రపంచ స్థాయి ప్రతిభ పొంది విదేశాల్లో ఉపాధి అవకాశాలను తప్పక పొందగలరన్నారు.

అంబేడ్కర్ వర్ధంతి సభ జయప్రదం చేయాలి

ఒంగోలు: అంబేడ్కర్ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సృజన్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగే కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, రాష్ట్రమంత్రివర్యులు డాక్టర్ ఆదిమూలపు సురేష్‌తోపాటు శాసన సభ్యులు, మాజీ శాసన సభ్యులను, ప్రజా ప్రతినిధులను, వివిధ కార్పొరేషన్ల ప్రతినిధులను, దళిత సంఘాల నాయకులను ఆహ్వానించామన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒంగోలు సెంట్రల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం విజయవంతం చేయాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎన్. లక్ష్మా నాయక్ కోరారు. ఉదయం హెచ్‌సీఎం స్కూల్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి, కొల్లాస్ హోటల్ ఎదురుగా ఉన్న కాంస్య విగ్రహానికి కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్, అధికారులచే పూల మాలల వేసి నివాళులు అర్పిస్తామని చెప్పారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఒంగోలు: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కడపలో ఉంటుందన్నారు. 35 రోజులపాటు జరిగే ఈ శిక్షణలో టాలీ, రిటైల్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్, కస్టమర్ రిలేషన్స్, లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో మెళకువలు నేర్పుతారన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తారన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్‌తోపాటు మల్టీనేషనల్ కంపెనీల్లో బెంగళూరు, హైదరాబాదు, చెన్నైలలో 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని హరిప్రసాద్ తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 9000487423 ని సంప్రదించాలన్నారు.

కల్వర్టులోకి దూసుకెళ్లిన వాహనం

చీరాల అర్బన్: పట్టణంలోని మసీదు సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న కల్వర్టులోకి మంగళవారం అదుపుతప్పి ఒక బొలెరో వాహనం దూసుకెళ్లింది. వర్షం కారణంగా డ్రైవర్‌కు దారి కనిపించకపోవడంతో పక్కన నిర్మాణంలో ఉన్న కల్వర్టులోకి వెళ్లింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ప్రమాదం జరగలేదు.



చీమకుర్తి: నేలమట్టమైన వరి పొలాలు



నాగులుప్పలపాడులో నీట మునిగిన కాలనీ



కనపర్తి పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న తీరప్రాంత గ్రామాల ప్రజలు



ప్రగతి కాలనీలో పనులు పరిశీలిస్తున్న బాలినేని ప్రణీత్ రెడ్డి

కన్నీటి మిచాంగ్

- తుఫాన్ ధాటికి రైతులు విలవిల
- భారీగా పంట నష్టం
- నీట మునిగిన పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలు

చీమకుర్తి: తుఫాన్ ప్రభావంతో సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాల్లో ఆది, సోమ వారాల్లో భారీ నష్టం వాటిల్లింది. చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, భారీ గాలుల ధాటికి ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన పలు పంటలలు దెబ్బతిన్నాయి. చీమకుర్తి మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం...చీమకుర్తి మండలంలోని ఇలపావులూరు, గాడిపర్తివారిపాలెం పరిసరాలలో దాదాపు 200 ఎకరాల్లో మొక్కజొన్న నేలమట్టమైంది. దేవరపాలెం, పాటిమీదపాలెం, నాయుడుపాలెంతో పాటు పలు గ్రామాల్లో 300 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. కంది 1000 ఎకరాలు, పొగాకు 1500 ఎకరాలకు గాను కొన్ని చోట్ల పూర్తిగా నీటిలో మునగగా మరికొన్ని చోట్ల ఉరకేసే ప్రమాదం ఏర్పడింది. మినుము, శనగ, బొబ్బర్లు పంటలకు కూడా స్వల్పంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఇక సంతనూతలపాడు మండలంలోని మంగమూరు నుంచి ఒంగోలు వెళ్ళే దారిలో ఉన్న నల్లవాగు దాదాపు 4 అడుగుల లోతున ప్రవహిస్తూ రాకపోకలకు తీవ్రంగా అంతరాయం కలిగించినట్లు తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు తెలిపారు. చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వదరకు 45 మి.మీ వర్షం పడింది.

మద్దిపాడు: మిచాంగ్ ప్రభావం మద్దిపాడు మండలంలో పంటలపై పడింది. సాధారణంగా రబీ సీజన్‌లోవేసే మిర్చి, పొగకు, శనగ పంటలు ఉండగా 15 నుంచి 25 రోజుల క్రితం వేసిన పొగ మొక్కలునీటి పై తేలియాడుతున్నాయి. మిర్చి పంట చాలా వరకూ నీటమునిగి పోయింది, మండలంలో సుమారు 2200 ఎకరాల్లో పొగాకు, 216 ఎకరాల్లో మర్చి పంటను సాగు చేశారు. వర్షాలు తగ్గిన తరువాతనే పంట నష్టాన్ని అంచనా వేయగలమని వ్యవసాయ శాఖ అధికారి కె. రమేష్ తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల వరకు 83 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా మధ్యాహ్నం 2 గంటల వరకూ మరో 15 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిచాంగ్ తుఫాను వలన మండలంలో జన జీవనం స్థంభించి పోయింది. సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభం కావడం ప్రభుత్వం హెచ్చరికల నేపథ్యంలో ఎక్కడికక్కడ ప్రజలు ఇళ్లలోనే ఉండిపోయారు.

నాగులుప్పలపాడు: కనపర్తి తీరప్రాంతంలో సముద్రం అలలు ఎగిసిపడతంతో పాటు 50 మీటర్లు ముందుకు వచ్చింది. చిన్నంగారిపట్టపుపాలెం, మేకలసోమయ్య పట్టపుపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకార కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించి వసతి ఏర్పాట్లు చేశారు. డ్వామా పీడీ శీనారెడ్డి కనపర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. 700 హెక్టార్లలో వరి, 167 హెక్టార్లలో మినుము, 14 హెక్టార్లలో కంది, 925 హెక్టార్లలో పొగాకు, వెయ్యి హెక్టార్లలో మిరప పంట దెబ్బతిన్నట్లు ఏడీఏ రమేష్ బాబు తెలిపారు. నాగులుప్పలపాడు– తిమ్మనపాలెం గ్రామాల మధ్యలో ఉన్న 3 నేల చప్టాలలపై వరద నీటి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను దారి మళ్ళించారు. మంగళవారం మధ్యాహ్నం ఉప్పుగుండూరు నుంచి మట్టిగుంట గ్రామానికి వెళ్తున్న వృద్ధుడు వర్షం ధాటికి సొమ్మసిల్లి పడిపోవడంతో చికిత్స అందించారు.

నగరంలో విస్తృత సేవలు

ఒంగోలు సబర్బన్: మిచాంగ్ తుఫాను వల్ల ఒంగోలు నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నగర పాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను నగరంలో ఏర్పాటు చేసిన 16 తుఫాను పునరావాస కేంద్రాలకు కూడా తరలించారు. అదేవిధంగా నగరంలోని నేతాజీ కాలనీ, పాత మార్కెట్, దక్షిణ బైపాస్ రోడ్డు ఏరియా, కర్నూలు రోడ్డుతో పాటు బాలినేని శ్రీనివాస్ కాలనీలో వర్షపు నీరు, మురుగు నీరు సజావుగా బయటకు వెళ్ళేవిధంగా జేసీబీలు, ప్రొక్లెయిన్ల ద్వారా పనులు చేపట్టారు. మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావులు వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చేశారు. మురుగు కాలువల్లోని అడ్డంకులను కూడా తొలగించారు.

అన్నదానం

ఒంగోలు అర్బన్: తుఫానుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సూర్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దత్తాత్రేయ నగర్, అరవ కాలనీల్లోని సుమారు 200 మందికి ఆహారం అందించారు. ట్రస్టు సెక్రటరీ సర్దార్ బాషా, మారెళ్ల సుబ్బారావు, శ్రీనివాసరావు, సుధీర్, రమేష్, పవన్, సుబ్బారెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

ఒంగోలు సబర్బన్: మిచాంగ్ తుఫాపఖ ప్రభావంతో ఈదురు గాలులకు ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలిగింది. రామ్ నగర్ 4వ లైన్‌లో రైల్వే ట్రాక్‌కు సమీపంలో రోడ్డు పక్కనున్న చెట్టు కూలటంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం పడిపోయింది. దీంతో సోమవారం రాత్రి నుంచి రామ్ నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. హౌసింగ్ బోర్డు కాలనీలో చెట్లు, నగరంలోని 26వ డివిజన్‌లోని గాంధీ రోడ్డులో చెట్టు కూలటంతో విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి.

వైఎస్సార్‌సీపీ నాయకులు జాజుల కృష్ణ విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. ఒంగోలు డి–2 విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ డి.వెంకటేశ్వర్లు ఆధర్యంలో పునరుద్ధరించారు.



వజ్జిరెడ్డిపాలెం పట్టపుపాలెంలో భోజన ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ప్రణీత్‌రెడ్డి, అంజిరెడ్డి

శివారు కాలనీల్లో ప్రణీత్‌రెడ్డి పర్యటన

ఒంగోలు: తుఫాను తీవ్రతకు ప్రజలు ఇబ్బందులు పడరాదనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తలు కాలనీల్లో పర్యటించారు. నీరు నిల్వకుండా చర్యలు చేపట్టడంతోపాటు పునరావాస శిబిరాలను సందర్శించారు. మదర్ థెరెస్సా కాలనీ, ప్రగతి కాలనీతోపాటు అనేక ప్రాంతాల్లో తుఫాను కారణంగా ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సుమారం ఐదు వేలమంది ప్రజానీకానికి ఆహారం అందించారు. విద్యుత్ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు , సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఎప్పటికప్పుడు బాలినేని నివాసంలో ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించారు. బాలినేని పిలుపుతో పలు స్వచ్ఛంద సంస్థలు కూడా రంగంలోకి దిగి పేదలను ఆదుకునేందుకు ముందుకు వచ్చాయి. చిన్న వర్షానికి సైతం చెరువులను తలపించే పరిస్థితి గతంలో ఉండేది. అయితే బాలినేని ముందస్తు సూచనలతో నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పోతురాజు కాలువ పూడిక తీత పనులు వేగవంతంగా చేపట్టడంతో ఆర్టీసీ బస్టాండు సెంటర్‌లో సైతం చుక్కనీరు నిలబడని పరిస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్, వివిధ డివిజన్ల నాయకులు, ఒకటో క్లస్టర్ ఇన్‌ఛార్జి రాయపాటి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులకు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డి మంగళవారం ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి బయటకు వెళ్లడానికి వీలు కుదరక ఇంటికే పరిమితమయ్యారు. దీంతో మంగళవారం వజ్జిరెడ్డిపాలెం పట్టపుపాలెంను ఆయన సందర్శించారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వజ్జిరెడ్డిపాలెం సర్పంచ్ బద్దేల జాలిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వి.బాలాజి, వెల్ఫేర్ అసిసెంట్ వి.గిరిష్‌బాబు సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ఇళ్లు కూలిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ఒంగోలు టౌన్: తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలు, వీచిన బలమైన గాలులకు నగరంలోని ధారావారి కాలనీలో చెట్లు కూలి మూడు ఇళ్లు ధ్వంసమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం సభ్యులతో కలిసి కాలనీలో పర్యటించారు. బోరుబోతుల ఏలియా రాని, నందిగం కోటయ్య, బోరుబత్తులన అంజయ్యలకు చెందిన రేకుల ఇళ్లు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం తక్షణమే బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్, ఆర్డీఓలకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామని తెలిపారు. టి. మహేష్, కె. శ్రీనివాసరావు, చిన్నబ్బాయి, రవి, కొర్నిపాటి చిన్న యాకోబు పాల్గొన్నారు.

పొగాకు తోటలను పరిశీలించిన ఆర్ఎం

ఒంగోలు సెంట్రల్: నీట మునిగిన పొగాకు పంటను పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు మంగళవారం తన సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఒంగోలు–1, ఒంగోలు–2 పొగాకు బోర్డు పరధిలోని లింగం గుంట, మండువ వారిపాలెం, త్రోవగుంటలో పరిశీలించి పొగాకు సాగు చేయు రైతులకు తగిన సూచనలు చేశారు. వర్షం ప్రభావం తగ్గిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వేలం నిర్వహణాధికారులు రామక్రిష్ణ, రవి కాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్: రూరల్‌లోని అన్ని గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి మంగళవారం రాత్రి వరకు సరాసరిన 80 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచాయి. తహసీల్దార్ మురళి గుండాయపాలెంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. డీఆర్డీఏ పీడీ రవికుమార్, ఎంపీడీఓ పి.సుజాత, తహసీల్దార్ మురళి ,తాలుకా సిఐ పి.భక్తవత్సల రెడ్డి, ఎస్సై మలికార్జున్ పర్యవేక్షించారు. ముందస్తు జాగ్రతగా సోమవారం నుంచి విద్యుత్ ఏఈ చెన్నారెడ్డి విద్యుత్ సరఫరాను నిలిపి వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



చదలవాడ వద్ద విద్యుత్ తీగలను బాగు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది



ఉప్పుగుండూరులో విరిగిపడిన విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న సిబ్బంది



ధారావారి కాలనీలో కూలిన రేకుల ఇళ్లు



నాగులుప్పలపాడు: విద్యుత్ తీగలపై పడిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



కనపర్తి తీర ప్రాంత సముద్రంలో ఎగిసిపడుతున్న అలలు



18వ డివిజన్‌లో వృద్ధురాలికి ఆహార పదార్థాలు అందిస్తున్న ప్రణీత్ రెడ్డి



ఒంగోలు రూరల్: తీరప్రాంత గ్రామాల్లో పరిస్థితి సమీక్షిస్తున్న ఒంగోలు తహసీల్దార్, తాలూకా సీఐ



చీమకుర్తి: మంగమూరు వాగు ప్రవాహాన్ని చూపుతున్న తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు



ఒంగోలు రూరల్: ఒంగోలు గుండాయపాలెం రహదారిపై కూలిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం



ఒంగోలు నగరంలో గాలులు బలంగా వీస్తున్న దృశ్యం



ఒంగోలు నగరంలో కురుస్తున్న వర్షం

జిల్లా జైలులో నేత్ర వైద్య శిబిరం

ఒంగోలు టౌన్: జిల్లా కారాగారంలోని ముద్దాయిలు, జైలు సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. నగరానికి చెందిన మోడరన్ కంటి ఆసుపత్రి , రిసెర్చ్ సహకారంతో మంగళవారం డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ అర్పణ షెఫర్డ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి చూపును కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. అనంతరం జైలు సూపరింటెండెంట్ పి. వరుణారెడ్డి మాట్లాడుతూ.. కారాగారంలోని ఖైదీలు, సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు నిరంతరం వ్యాయామం, యోగా చేయాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కారాగార డాక్టర్ కేఎస్‌వీఎస్ బ్రహ్మతేజ, జైలర్ వి.రమేష్, డిప్యూటీ జైలర్ బి.శ్రీనివాసరావు, ఫార్మాసిస్ట్ యంవీ సురేష్ పాల్గొన్నారు.



ముద్దాయిలకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సంచార జాతులకు టార్పాలిన్ షీట్లు పంపిణీ



టార్పాలిన్ షీట్లు పంపిణీ చేస్తున్న రెడ్ క్రాస్

ఒంగోలు టౌన్: మిచాంగ్ తుఫాను నేపథ్యంలో కొత్త కూరగాయల మార్కెట్ సమీపంలో రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారులకు రెడ్‌క్రాస్ సహకారంతో టార్పాలిన్ షీట్లను పంపిణీ చేశారు. వర్షం, చలిగాలుల కారణంగా వ్యాపారాలు చేసుకోలేక ఇబ్బంది పడుతున్న 55 కుటుంబాల దుస్థితిని గమనించి హైజీన్ కిట్లను కూడా పంపిణీ చేశారు.

విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్న వారిని దాతలు సాయం చేసి ఆదుకోవాలని రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్ కోరారు. సంస్థ వైస్ చైర్మన్ డా.వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి రాఘవ, ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ మణిబాబు, కోసూరి శ్రీదేవి, శ్రీనివారావు పాల్గొన్నారు.